సాక్షి నాగర్‌కర్నూల్

శుక్రవారం ׀ 16 ׀ ఆగస్టు ׀ 2024

గరిష్టం/కనిష్టం
33.4 /25.3

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.



జాతీయ పతాకాన్ని ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

న్యూస్‌రీల్

మూడో విడత రుణమాఫీ రూ. 261.36 కోట్లు

- జిల్లాలో 21,352 మంది రైతులకు లబ్ధి



అచ్చంపేట: రైతు రుణమాఫీ పథకానికి సంబంధించి మూడో విడత నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. రూ. 1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల లోపు ఉన్న పంట రుణాలను గురువారం మాఫీ చేసింది. శుక్రవారం నుంచి అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ సొమ్మును చేయనున్నారు. మూడో విడత రుణమాఫీకి 15,794 కుటుంబాలకు చెందిన 21,352 మంది రైతులు అర్హులుగా గుర్తించింది. వివిధ బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రూ. 261.36 కోట్ల రుణాలు మాఫీ అయినట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. మొదటి విడతలో 47,750 మంది రైతులకు రూ. 270.04 కోట్లు, రెండవ విడతలో 32,406 మంది రైతులకు రూ. 312 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. మూడు విడతల్లో మొత్తం 1,01,508 మంది రైతులకు రూ. 843.04 కోట్ల రుణాలు మాఫీ అయినట్లు అధికారులు తెలిపారు. కాగా, మొదటి, రెండవ విడతల్లో అనేక మంది రైతుల రుణాలు మాఫీ కాకపోవడంతో గగ్గోలు పెడుతున్నారు. మొదటి విడతలో రూ. లక్ష లోపు, రెండో విడతలో రూ.లక్షన్నర లోపు మాఫీ సైతం జరగలేదని పలువురు పేర్కొంటుండగా.. తాజాగా మూడో విడతలోనైనా తమ పేర్లు ఉంటాయా.. లేదా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మానవతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం బుల్లెట్ ర్యాలీ చేపట్టారు. అనంతరం కొట్రగేట్ వద్ద జాతీయ రహదారిపై వేగంగా వెళ్లే వాహనాలను నియంత్రించే విధంగా 3డీ పోలీస్ ఇమేజ్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, నాయకులు ఆనంద్‌కుమార్, మానవతా ఫౌండేషన్ ఫౌండర్ రమ్య సౌజన్య, డా.శివరాం, శరత్, రంజిత్, సందీప్, ప్రవీణ్, మురళి, అంజి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రగామిగా నిలుపుతాం

రైతు సంక్షేమానికి సరికొత్త ప్రణాళికలు

- ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల అమలు
- రైతులపై ఆర్థికభారం తగ్గించేందుకే రూ. 2 లక్షల రుణమాఫీ
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి



పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

నాగర్‌కర్నూల్: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిచేసి అగ్రగామిగా నిలుపుతామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఎందరో యోధుల పోరాట ఫలితంగా స్వాతంత్య్ర ఫలాలను అనుభవిస్తున్నామని అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల స్ఫూర్తితో దేశాన్ని ప్రగతి బాటలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతామన్నారు. అధికారం చేపట్టిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 2,76,50,000 మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారన్నారు. రూ. 500లకు గ్యాస్ సిలిండర్ పంపిణీతో 1,03,662 మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. గృహజ్యోతి పథకంతో 90,447 మంది విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని.. గత డిసెంబర్ 9వ తేదీ నుంచి ఇప్పటి వరకు 60,541 మంది ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవలు పొందినట్లు తెలిపారు. వైద్యసేవల నిమిత్తం ప్రభుత్వం రూ.132 కోట్ల మేర ఖర్చు చేసిందన్నారు.

రూ. 562.33 కోట్ల రుణాలు మాఫీ..



రైతులపై ఆర్థికభారం తగ్గించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ. 562.33 కోట్ల రుణాలను ఇప్పటి వరకు మాఫీ చేసినట్లు తెలిపారు. మొదటి విడతగా రూ. లక్ష లోపు రుణం 46,780 మంది రైతులకు రూ. 265.21 కోట్లు.. రెండో విడతలో 30,501 మందికి రూ. 297.12 కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు వివరించారు. రైతుబీమా పథకం ద్వారా 6,012 మంది రైతుల నామినీలకు రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 300.6 కోట్లు అందించినట్లు తెలిపారు.



పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

ఆర్థిక స్వావలంబన కోసం 'మహిళాశక్తి'..

మహిళాశక్తి పథకంతో 2024–25 సంవత్సరం స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు రూ. 38.97 కోట్ల రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన యూనిట్లతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యమన్నారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్లతో ప్రజలు మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలువురు స్వాతంత్య్ర సమరయోధులను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

పురోగతిలో 'పాలమూరు' పనులు..

పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 12 ప్యాకేజీలలో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మొదటి దశలో ఒక పంపుసెట్ రన్ చేసినట్లు తెలిపారు. ఏదుల, వట్టెం పంప్‌హౌస్‌లలో రెండు పంపుల చొప్పున డ్రై రన్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. రూ. 76.95 కోట్లతో పరిపాలన అనుమతులు పొందిన మార్కండేయ ఎత్తిపోతల పథకంతో 7,310 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇప్పటికే ఒక పంపు ట్రయల్ రన్ చేసినట్లు తెలిపారు. కాల్వల పనులు త్వరితగతిన పూర్తిచేసి, సాగునీరు అందిస్తామన్నారు.

'భగీరథ'తో చెంచులకు తాగునీరు..

మిషన్ భగీరథ పథకంతో జిల్లావ్యాప్తంగా 726 ఆవాసాల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు గాను 2024.9 కి.మీ. మేర పైప్‌లైన్, 601 వాటర్ ట్యాంకులను నిర్మించడంతో పాటు 1,95,836 నల్లా కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. నల్లమల ప్రాంతంలోని చెంచు ఆవాసాలకు బోరు, సోలార్ పంపుసెట్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

■ జిల్లాలో ఈ ఏడాది 7,507 కాన్పులు జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 5,679 కాన్పులు కాగా.. అందులో 2,935 సాధారణ, 2,744 శస్త్ర చికిత్స ద్వారా కాన్పులు జరిగాయన్నారు. అటవీ హక్కు చట్టం–2006 ద్వారా 2023లో 1,972 మంది గిరిజనులకు 5,037 ఎకరాల భూమిని పంపిణీ చేసినట్లు వివరించారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట..

తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను రూపొందిస్తుందని అన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ పురోగతికి అవసరమైన ప్రణాళికలను అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ పథకాలతో పాటు వ్యవసాయ కమిషన్ ఏర్పాటు దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. యాసంగి పంట పెట్టుబడికి గాను 7.38 లక్షల ఎకరాలకు రూ. 369.21 కోట్లు విడుదల చేసిందన్నారు.

త్రివర్ణ శోభితం

నాగర్‌కర్నూల్: జిల్లావ్యాప్తంగా గురువారం 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఊరూవాడ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. వేడుకలకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకం ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఎదనిండా దేశభక్తితో కళాత్మకత ఉట్టిపడేలా నృత్యాలు చేశారు. మరికొందరు విద్యార్థులు తమ విన్యాసాలతో అబ్బురపరిచారు. అత్యుత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులను చిన్నారెడ్డితో పాటు కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, అదనపు కలెక్టర్ సీతారామారావు అభినందించి మెమొంటోలతో సత్కరించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రగతి శకటాలను ప్రదర్శించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ శకటానికి మొదటి బహుమతి సాధించింది. అలాగే ఆయా శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయగా.. అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు తిలకించారు.

నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలి

నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో జాతీయ పతాకం ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివక్షలకు తావులేని సమాజ నిర్మాణమే స్వాతంత్య్ర సమరయోధులకు నిజమైన నివాళి అనిఅన్నారు. జిల్లా అభివృద్ధికి పునరంకితమై పనిచేద్దామని పిలుపునిచ్చారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అర్హులందరికీ అందేలా అధికార యంత్రాంగం కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

నాగర్‌కర్నూల్ క్రైం: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని.. స్వాతంత్య్ర సమరయోధుల స్ఫూర్తితో ముందుకుసాగాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ పతాకం ఆవిష్కరించి మాట్లాడారు. ఎంతో మంది పోరాటయోధులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చారన్నారు. పోలీసు అధికారులు జాతి సమగ్రత, శాంతి సమాజ స్థాపన కోసం దృఢ నిశ్చయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

ఉత్తమ అధికారులకు ప్రశంసలు

నాగర్‌కర్నూల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉత్తమ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. పలువురు పోలీసులకు సేవా, ఉత్తమ సేవా పతకాలను ప్రదానం చేశారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనునాయక్



సురేష్, ఆర్డీఓ, నాగర్‌కర్నూల్ | నాగరాజు, ఆర్డీఓ, కొల్లాపూర్ | మాధవి, ఆర్డీఓ, అచ్చంపేట | శ్రీధర్, మిషన్ భగీరథ ఈఈ | గోవిందరాజులు, డీఈఓ



చిన్న ఓబులేష్, డీఆర్డీఓ | రవికుమార్ జిల్లా అధికారి | జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్ | హేమలత, మిషన్ భగీరథ డీఈ | భాస్కర్, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్



సాయికిరణ్, సీనియర్ అసిస్టెంట్ | మాసూమ్, ఆర్‌ఐ, నాగర్‌కర్నూల్ | ఆరిఫ్, ఏఎస్‌ఐ, ఎస్‌బీ | మోయిన్‌ఖాన్, ఏఎస్‌ఐ | రాందాస్, సివిల్ కానిస్టేబుల్



శ్రీనివాస్, డీఎస్పీ, నాగర్‌కర్నూల్ | మనోహర్, ఏఆర్ ఏఎస్‌ఐ | కృష్ణయ్య, సివిల్ ఏఎస్‌ఐ | ప్రభాకర్, ఏఆర్ కానిస్టేబుల్ | రవీందర్, హోంగార్డు

అయ్యో.. దేవుడా

దైవదర్శనానికి వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు..

- హైదరాబాద్‌లోని పెద్ద గోల్కొండ ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదం
- డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరి దుర్మరణం, మృతుల్లో 2 నెలల చిన్నారి
- కోమాలోకి ఓ బాలిక, మరో నలుగురికి తీవ్ర గాయాలు
- ఆత్మకూర్‌లో విషాదఛాయలు



సంతోషంగా దైవదర్శనమైంది.. ఇక బాలుడికి దోలాహరణం జరుపుదామని చర్చించుకుంటున్న వారి కలలను ఒక్క కుదుపు ఛిద్రం చేసింది.. ఏమైందా అని తెలుసుకునేలోపే చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు ఒకవైపు.. రక్తగాయాలతో విలపిస్తున్న వారు మరోవైపు.. తమ వారికి ఏం జరిగిందా అని ఆరాతీస్తున్న వారితో ఆ ప్రాంతమంతా హృదయ విదారకంగా మారింది.. అయ్యో దేవుడా.. ఇప్పుడే కదా నిన్ను దర్శించుకొని క్షేమంగా చూడాలని కోరుకున్నాం.. అంతలోనే ఎంత పనిచేశావు స్వామీ.. అంటూ గుండెలవిసేలా రోదించిన తీరు ప్రతి ఒక్కరితోనూ కంటతడి పెట్టించింది. – ఆత్మకూరు

వివరాలు 10లో..

కూలీలను కబళించిన మృత్యుశకటం

- ఎన్‌హెచ్–44పై ఆటోను ఢీకొట్టిన లారీ
- ఇద్దరు మహిళలు మృతి, మరో 17 మందికి తీవ్రగాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- క్షతగాత్రులకు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స

– అలంపూర్/ఉండవెల్లి

వివరాలు 10లో..



ఉండవెల్లి స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైన ఆటో

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం



నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పస్పుల బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్/కోడేరు: ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం కోడేరు మండలంలోని పస్పుల, బావాయిపల్లి, నాగులపల్లిలో కేఎల్ఐ బ్రాంచ్ కెనాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కేఎల్ఐ కాల్వలను పట్టించుకోకపోవడంతో జమ్ము, కంపచెట్లతో పేరుకుపోయి రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. కేఎల్ఐ నుంచి పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కాల్వల్లో జమ్ము, కంపచెట్లను వెంటనే తొలగించాలని ఇరిగేషన్ శాఖ సీఈ విజయభాస్కర్‌ను మంత్రి ఆదేశించారు. సాగునీటి విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మంత్రి వెంట ఈఈ రవీందర్, మాజీ ఎంపీపీ రామ్మోహన్‌రావు ఉన్నారు.

■ చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్‌లోని ఆర్ఐడీ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో పాల్గొని విద్యార్థులకు విద్యా డైరీలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

వృద్ధురాలిపై లైంగికదాడి

● కేసు నమోదు చేయడం లేదని బాధితుల ఆరోపణ

ఊట్కూర్: వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా ఈ విషయం ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడం లేదని బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధురాలు ఈ నెల 8 గురువారం ఇంట్లో ఉండగా మధ్యాహ్నం వేళలో పంచాయతీ కార్మికుడు సత్యం ఇంట్లోకి చొరబడి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. మూడు రోజుల తర్వాత వృద్ధురాలు మనోవేదనతో ఏడుస్తుండడంతో భర్త ఆమెను ప్రశ్నించగా, విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ నెల 11న భర్తతో కలిసి వృద్ధురాలు ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నాలుగు రోజులైన పోలీసులు కేసు నమోదు చేయడం లేదని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై హెడ్‌కానిస్టేబుల్ సురేందర్‌ను వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు చేశారని, ఎస్‌ఐ లేనందున ఉన్నతాధికారులకు సమాచారం అందించానని ఆయన తెలిపారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

అయిజ: ఉరేసుకుని వివాహిత బలవన్మరణం చేసుకున్న ఘటన బుధవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన బోయ పెద్ద రాముడుకి ఈడుగోని పల్లికి చెందిన సరస్వతితో 13ఏళ్ల క్రితం మొదటి వివాహం జరిగింది. కొన్ని కారణాల వల్ల సరస్వతి, రాముడు రెండేళ్ల క్రితం విడిపోయారు. ఇదిలా ఉండగా రాముడు ఆరు నెలల క్రితం కర్నూలు జిల్లా పెద్ద కడుమూరుకు చెందిన రాధికను రెండో వివాహం చేసుకున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో భర్త లేని సమయంలో రాధిక తన చీర కొంగుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలిసిన పోలీసులు కిటికీ ఊచలు తొలగించి మృతదేహాన్ని కిందికి దింపారు. తన కూతురికి కడుపునొప్పి ఉందని, అది భరించలేక ఉరేసుకుందని మృతురాలి తండ్రి లక్ష్మయ్య గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మమ్మాయిపల్లిలో మహిళ ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లికి చెందిన బోయిని మహేశ్వరి (38) ఇంటి వద్ద ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహేశ్వరి భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. మానసికంగా ఇబ్బంది పడుతున్న ఆమె ఇంటి ఎదుటే ఉరేసుకుంది. తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): మండలంలోని ఖానాపూర్ చెందిన శ్రీకాంత్ (23) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ ప్రేమ విఫలమవడంతో కొద్ది రోజులుగా మనస్తాపం చెంది, కోళ్ల షెడ్డులో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. యువకుడి అక్క లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి తెలిపారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి



సత్యమ్మ (ఫైల్)

శాంతినగర్: ఉరేసుకుని వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీలోని పైపాడులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పైపాడుకు చెందిన వడ్ల సత్యమ్మ (36) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త రాఘవేంద్రాచారికి పక్షవాతం రావడంతో రాజోళి మండలం తుమ్మిళ్లలో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం పైపాడులో ఉన్న అత్త తుమ్మిళ్లకు వెళ్లింది. పెద్ద కూతురికి వివాహం అవడం మరో కూతురు, ఇద్దరు కుమారులు హాస్టళ్లలో చదువుతుండటంతో ఒంటరిగా సత్యమ్మ ఉంది. పాఠశాలకు సెలవుకావడంతో గురువారం ఇంటికి చేరుకున్న పిల్లలు తలుపు తెరిచే సరికి పైకప్పుకు వేలాడుతు కనిపించింది. దీంతో భయపడిన పిల్లలు తుమ్మిళ్లలో ఉంటున్న తాత కృష్ణమూర్తికి ఫోన్‌లో సమాచారం అందించారు. పిల్లల రోదనలు విన్న ఇరుగు పొరుగు వారు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం ఉబ్బి ఉండటంతో రెండు రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ అయ్యన్న తెలిపారు.

మదినిండా దేశభక్తి





నారాయణపేటలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో విద్యార్థుల వేషధారణ



గద్వాలలో పంజాబీ డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాడవాడలా, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, పలు సంస్థల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన చేపట్టారు. స్వాతంత్య్ర సమరయోధులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. – సాక్షి, నెట్‌వర్క్



నారాయణపేటలో పోలీస్ జాగిలం విన్యాసాలు



నాగర్‌కర్నూల్‌లో దేశభక్తి పాటకు విద్యార్థుల నృత్య ప్రదర్శన



నాగర్‌కర్నూల్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో యోగా ప్రదర్శన



మహబూబ్‌నగర్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన





మహబూబ్‌నగర్‌లో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ శకటం, అటవీశాఖ ఆధ్వర్యంలో ఎకో టూరిజం జంగిల్ సఫారీ శకటం ప్రదర్శన

అంత్యక్రియలు అడ్డుకోవడంపై ఆందోళన



గద్వాల కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న ఇర్కి చేడుతండా వాసులు

ధరూరు: శ్మశానవాటికలో అంత్యక్రియలను నిర్వహిస్తుండగా, పక్కపొలం వ్యక్తి అడ్డుకోవడంతో పోలీస్‌స్టేషన్ వెళ్లారు. పోలీసులు తమతో దురుసుగా ప్రవర్తించారని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే.. కేటీదొడ్డి మండలం ఇర్కిచేడుతండాకు చెందిన కొరియా నాయక్(60) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గ్రామ శివారులో శ్మశానవాటిక కోసం కేటాయించిన మూడు ఎకరాల స్థలంలో మృతదేహాన్ని పూడ్చటానికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా, ఆ పొలం పక్కనే అదే గ్రామానికి చెందిన గోబ్యా నాయక్ ఆ స్థలం తమదని అడ్డుకున్నాడు. దీంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు న్యాయం కోసం గురువారం మధ్యాహ్నం కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులు తమతో దురుసుగా ప్రవర్తించారని, మాకు న్యాయం చేయాలంటూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న సీఐ భీంకుమార్ అక్కడికి చేరుకుని సమస్యను తెలుసుకున్నారు. చట్టపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించిన తండావాసులు సీఐకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ విషయమై కేటీదొడ్డి ఎస్‌ఐ శ్రీనివాసరావును వివరణ కోరగా శ్మశానవాటికకు కేటాయించిన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని గ్రామస్తులు తమ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల సహకారంతో సమస్యను పరిష్కరించుకోవాలని బాధితులకు తెలియజేశామని, న్యాయం కోసం వచ్చిన వారితో దురుసుగా ప్రవర్తించలేదని సమాధానం చెప్పారు.

కణితి మాంసం స్వాధీనం: ముగ్గురు రిమాండ్

అమ్రాబాద్: మండలంలోని ఒంగురోనిపల్లి సమీపంలో విద్యుత్ కంచె వేసి అటవి జంతువు కణితిని వేటాడిన ఘటన ఈ నెల 12వ తేదీన చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎఫ్ఆర్ఓ గురుప్రసాద్ తెలిపిన ప్రకారం.. గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ కంచె వేసి కణితిని వేటాడినట్లు గుర్తించి అటవీశాఖ అధికారులు అక్కడికి వెళ్లే లోపే వేటగాళ్లు మాంసం వదిలి పారిపోయారు. పూర్తి విచారణ అనంతరం వేటాడిన వారిని గుర్తించి వణ్యప్రాణి పరిరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఒంగురోనిపల్లికి చెందిన పిల్లి సాయిలు, జక్క నరసింహరావు, కదారి అంజయ్యలను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

నేడు తుమ్మిళ్ల లిఫ్ట్ నీటి విడుదల



మరమ్మతు పూర్తయిన ఆర్డీఎస్ కెనాల్

శాంతినగర్: ఆర్డీఎస్ కెనాల్ ప్రధాన సాగునీటి వనరు అయిన తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్‌ను శుక్రవారం ఉదయం ఆన్ చేయనున్నట్లు ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం డి–29 వద్ద కెనాల్ కోతకు గురవడంతో తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ బంద్ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయమై 'సాక్షి'లో ప్రచురితమైన నీటి విడుదల ఎప్పుడో', ఆర్డీఎస్ రైతుల ఆశలు అడియాసలు కథనాలకు స్పందించిన అధికారులు మూడు రోజుల పాటు ఇటాచీ, ట్రాక్టర్లతో కోతకు గురైన ప్రదేశాన్ని మట్టితో నింపి మరమ్మతు చేయించారు. పనులు పూర్తవడంతో తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్ చేసి ఆర్డీఎస్ కెనాల్‌కు నీటిని పంపింగ్ చేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలో ఉన్న గుండ్లచెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్‌ఐ హృషికేష్ గురువారం తెలిపారు. మృతుడి వయస్సు 40ఏళ్లు ఉంటుందని, కుడి చేతి మీద శివలీల అనే పచ్చబొట్టు, కడెం ఉందని తెలిపారు. చెరువు ఒడ్డు మీద నలుపు రంగు షార్టు, బూడిద రంగు ఫుల్ టీ షర్టు. ఫోన్ బుక్, సున్నం డబ్బా ఉందన్నారు. ఇతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

సాంబర్ మీద పడి బాలుడికి గాయాలు

దేవరకద్ర: వేడి వేడి సాంబర్ మీద పడి బాలుడిగా గాయాలైన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. బల్సుపల్లికి చెందిన ఆరేళ్ల బాలుడు కుష్వంత్ ఇంట్లో వండుతున్న సాంబర్ ప్రమాదవశాత్తు మీద పడడంతో తీవ్రంగా శరీరం కాలింది. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేసిన అనంతరం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన నిందితుడు అరెస్ట్?

గద్వాల క్రైం: నిరుద్యోగ యువతకు ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ముఠాలోని ఓ నిందితుడిని గద్వాల పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల గద్వాల మండలం పూడురు చెందిన గొల్ల కృష్ణయ్య నుంచి రూ.3లక్షలు వసూలు చేసి కలెక్టరేట్‌లో అటెండర్ పోస్టుకు అర్హత పొందినట్లు నకిలీ ఆర్డర్ కాపీ ఇచ్చారు. ఈ ఘటనపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఇద్దరు ముఠా సభ్యులపై ఈ నెల 12వ తేదీన చీటింగ్ కేసు నమోదైంది. అయితే ఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి నిందితులను గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం ఇర్ఫాన్‌ను పట్టణ శివారులో సంచరిస్తున్నట్లు సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. విచారణలో అసలు ముఠా సభ్యుల పేర్లు బహిర్గతం చేస్తాడా లేదా అనే విషయాలు తెలియాల్సి ఉంది. మరో ప్రధాన నిందితుడు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. త్వరలో నిందితుడిని అరెస్ట్ చేయనున్నట్లు సమాచారం. ఈ ముఠా సభ్యులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు నిరుద్యోగ యువతను ఉద్యోగల పేరిట డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు తెలుస్తుంది. నిరుద్యోగుల నుంచి రూ.కోట్లు దండుకున్నట్లు సమాచారం. విచారణలో అసలు దోషులెవరనేది త్వరలో తేలనుంది. ఈ ఘటనపై పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఎద్దు మృత్యువాత



మరికల్: వరినాటు కోసం కరిగేట చేస్తుండగా ఓ ఎద్దుకు ట్రాన్స్‌ఫార్మర్ తగిలి అక్కడిక్కడే మృతి చెందగా, మిగతా కూలీలు పరుగులు పెట్టి ప్రాణాలను దక్కించుకున్న ఘటన మాధవరంలో చోటు చేసుకుంది. మండలంలోని మాధవరం చెందిన రైతు బిజ్వార్ ఆంజనేయులు గురువారం తన పొలంలో వరినాటు వేసేందుకు ఎద్దులతో పలుగోరు కొడుతున్నాడు. ఈ క్రమంలో పొలం పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎద్దు తోక తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. నీళ్లకు కరెంట్‌షాక్ వచ్చే ప్రమాదం ఉందని పసిగట్టిన రైతుతో పాటు ఐదుగురు కూలీలు పరుగులు పెట్టి ప్రాణాలను దక్కించుకున్నారు. అనంతరం విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు తెలపడంతో వారు వెంటనే కరెంట్ సరఫరాను నిలిపివేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది కరిగేటలోనే మృతి చెందిన ఎద్దును పరిశీలించి పంచానామ చేశారు. రూ.70వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో బాధిత రైతు కన్నీరు పెట్టుకున్నాడు.

అంగన్‌వాడీ ఆయాకు కేంద్ర ఉత్తమ సేవా అవార్డు



కేంద్ర మంత్రి సావిత్రి ఠాకూర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఆయా పాత్కుల నిర్మల

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న పాత్కుల నిర్మలను కేంద్ర ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేశారు. గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ వద్ద జరిగిన స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి సావిత్రి ఠాకూర్ చేతులమీదుగా అవార్డు, జ్ఞాపిక అందజేశారు. అవార్డును అందుకోవడంపై మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని డీఐజీ కార్యాలయం ఎదుట జోగులాంబ గద్వాల జోన్‌-7 డీఐజీ ఎల్.ఎస్ చౌహన్ జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది డీఐజీకి గౌరవ వందనం సమర్పించారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

మహబూబ్‌నగర్ క్రైం: సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని క్రిస్టియన్‌పల్లిలో యాదగిరి అనే వ్యక్తికి చెందిన సెల్‌ఫోన్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు సెల్‌ఫోన్లు, రూ.10 వేల నగదు దొంగిలించారు. ఈ ఘటనపై గురువారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి



జాధరావ్‌పల్లి శివారులోని మృతి చెందిన చిరుత

మద్దూరు: అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి చెందిన ఘటన మండలంలోని జాధరావ్‌పల్లి శివారులోని తాటిగట్టు గుట్టపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాధరావ్‌పల్లి శివారులో తాటిగట్టు కిందే రాయంచెరువు ఉంది. చెరువులో నీళ్లు తాగడానికి చిరుత వచ్చి ఉంటుందని, ఈ క్రమంలో నీళ్లు తాగి గుట్టపైకి చేరే క్రమంలో ఏదైన జంతువు దాడి చేయడంతో మృతి చెంది ఉండొచ్చని గ్రామస్తులు తెలిపారు. మద్దూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణ్‌నాయక్ అక్కడి చేరుకున్నారు. రాత్రి కావడంతో గుట్టపై వెళ్లలేకపోయానని ఆయన పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చిన తర్వాత గుట్టపైకి వెళ్లి పరిశీలిస్తామని అధికారి తెలిపారు. గతంలో ఈ గుట్టల వరుసలో నందిపాడ్ శివారులో కూడా అనుమానాస్పదంగా మే 4న వరిచేనులో చిరుత మృతి చెందింది. మండలంలోని నందిగామ గుట్టలు, చెన్నారెడ్డిపల్లి గుట్టల్లో చిరుతలు సంచరిస్తున్నట్లు అధికారులు కూడా గుర్తించారు. వాటిని పట్టుకోవడానికి చర్యలు తీసుకోవడం లేదు. కాగా చిరుత మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

క్లుప్తంగా...

బాసర ఆలయంలో చోరీ

హుండీ పగులగొట్టిన దొంగలు


కెమెరాకు చిక్కిన అనుమానితుడు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి ఆలయం ఆవరణలో ఉన్న శ్రీదత్తాత్రేయ ఆలయంలో ఉన్న హుండీని దొంగలు పగులగొట్టారు. అంతటితో ఆగకుండా ఆలయానికి సమీపంలో ఉన్న భక్తులకు ప్రసాదం ఇచ్చే గది తలుపులు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. అయితే ఈ దృశ్యాలు రికార్డవుతాయని గుర్తించిన దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఆలయం లోపల, బయట సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారి కళ్లుగప్పి దొంగలు లోనికి ప్రవేశించడం భద్రతా లోపాలను ఎత్తిచూపింది. చోరీ జరిగిన విషయాన్ని ఉదయం గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, ముథోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై గణేశ్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా అనుమానితుడి ముఖం అందులో రికార్డు అయింది. దీని ఆధారంగా విచారణ జరుపుతున్నారు. అనుమానితుడు మహారాష్ట్ర వాసిగా భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆలయంలో ఎంత సొత్తు అపహరణకు గురైందనే విషయాలను ఆలయ అధికారులుగానీ, పోలీసులుగానీ వెల్లడించలేదు.

విషజ్వరంతో విద్యార్థి మృతి


ఊరడి రంజిత్ (ఫైల్)

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లిలో విషజ్వరంతో ఊరడి రంజిత్ (9) అనే బాలుడు మృతి చెందాడు. రంజిత్ 4వ తరగతి చదువుతున్నాడు. రెండ్రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న బాలుడిని గురువారం మధ్యాహ్నం గాంధారి ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. గ్రామంలో వారం రోజులుగా విష జ్వరాలు సోకి అనేక మంది బాధపడుతున్నారని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని గ్రామస్తులు వాపోయారు. బాధ్యులైన వైద్యాధికారులను, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు.


వరదకాల్వ ద్వారా తరలుతున్న ఎల్లంపల్లి జలాలు

3 ప్రాజెక్టులను

ఆదుకున్న 'ఎల్లంపల్లి'

ఎల్లంపల్లి టు రంగనాయకసాగర్ వయా మిడ్‌మానేరు • ఎత్తిపోతలతో తరలిన 20 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): నిన్నటిదాకా నీరు లేక వెలవెలబోయిన మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్ ప్రాజెక్టులు ప్రస్తుతం జలకళ సంతరించుకున్నాయి. ఎల్లంపల్లి జలాలు ఎత్తిపోతల ద్వారా వస్తుండడంతో మూడు ప్రాజెక్టుల్లో నీటినిల్వలు పెరిగాయి. బోయినపల్లి మండలం మాన్వాడ శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టులోకి శ్రీపాద ఎల్లంపల్లి జలాలు గాయత్రీ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతల ద్వారా చేరుతున్నాయి. మిడ్‌మానేరులో 17 టీఎంసీల మేర నీరు చేరిన తర్వాత ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ ప్రాజెక్టు ప్యాకేజీ-10లోకి.. అక్కడి నుంచి సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్రాజెక్టు-11లోకి నీరు విడుదల చేస్తున్నారు. ఎత్తిపోతలతో ఎల్లంపల్లి జలాలు నంది పంప్‌హౌస్ నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. అక్కడి నుంచి వరదకాల్వ మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లా మిడ్‌మానేరుకు, అక్కడి నుంచి అన్నపూర్ణతోపాటు సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు తరలుతున్నాయి. కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరదనీరు భారీగా చేరడంతో గత జూలై 27వ తేదీ నుంచి రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరదకాల్వ ద్వారా మిడ్‌మానేరుకు నీటి విడుదల కొనసాగుతోంది.

మిడ్‌మానేరు టు అన్నపూర్ణ.. రంగనాయకసాగర్

మిడ్‌మానేరు నుంచి ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ ప్రాజెక్టులోకి నీరు విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ పూర్తి నీటిమట్టం 3.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.60 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. మిడ్‌మానేరు అప్రోచ్ కెనాల్ నుంచి అన్నపూర్ణ ప్రాజెక్టుకు ఈనెల 5వ తేదీ నుంచి రోజుకు 6,400 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. అన్నపూర్ణ ప్రాజెక్టు నుంచి సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్యాకేజీ-11లోకి రోజుకు 3,300 క్యూసెక్కుల నీరు ఔట్‌ఫ్లోగా వెళుతోంది. ఇప్పటికే రెండు రెండు టీఎంసీల నీరు చేరింది. దీంతో ప్రస్తుతం రంగానాయకసాగర్ లో 2.75 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రంగనాయకసాగర్ నుంచి మల్లన్న సాగర్‌కు రోజుకు 3, 900 క్యూసెక్కుల నీరు మల్లన్నసాగర్ నుంచి కొండ పోచమ్మసాగర్‌లోకి 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.


మిడ్‌మానేరు ప్రాజెక్టు

ఆదుకున్న ఎల్లంపల్లి జలాలు

మిడ్‌మానేరులో గత జూలై 27వ తేదీకి ముందు 5.90 టీఎంసీల మేర నీటి నిల్వలు మాత్రమే ఉండేవి. ఈక్రమంలో మిడ్‌మానేరుకు ఎల్లంపల్లి జలాలు ఎత్తిపోతల ద్వారా వదలడంతో 20 రోజులుగా వచ్చిన నీటితో ప్రస్తుతం 15.91 టీఎంసీలకు నీటినిల్వ చేరింది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం నిత్యం 3,150 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోంది. ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు ఇప్పటి వరకు సుమారు 20 టీఎంసీల నీరు చేరింది. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న వరదకాల్వలో నీరు నిండుగా ప్రవహిస్తుండడంతో ఆయా పరిధిలోని రైతులు 2వేల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు.

మిడ్‌మానేరుకు ఎల్లంపల్లి జలాలు



గత జూలై 27 నుంచి మిడ్‌మానేరులోకి ఎత్తిపోతల ద్వారా ఎల్లంపల్లి జలాలు తరలుతున్నాయి. ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో ప్రభుత్వ ఆదేశాలతో అన్నపూర్ణ ప్రాజెక్టులోకి రోజుకు 6,400 క్యూసెక్కులు, కుడికాల్వకు 100 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నాం.

– జగన్, మిడ్‌మానేరు, ఈఈ


ఎట్ హోంలో గవర్నర్ జిష్ణుదేవ్‌తో సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్. చిత్రంలో బుర్రావెంకటేశం, వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, సీఎస్ శాంతికుమారి

జోరు వానలో ఎట్ హోమ్

పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, పొన్నం, పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: దేశ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం సాయంత్రం రాజ్‌భవన్ ప్రాంగణంలో ఎట్ హోమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నేతలు కె.కేశవరావు, చిన్నారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఎంపీలు మల్లు రవి, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభమైన కొద్దిసేపటికే భారీ వర్షం ప్రారంభమైంది. అయితే వాటర్‌ప్రూఫ్ టెంట్లు వేసి ఉండటంతో జోరు వానలోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి హాజరైన స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలు, పద్మ పురస్కార గ్రహీతల వద్దకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లి పలకరించారు. చివర్లో గవర్నర్ అతిథుల టేబుల్స్ వద్దకు వెళ్లి అందరినీ పలకరించారు. కాగా, వర్షపు నీటి ప్రవాహం టేబుల్స్ కిందకి చేరడంతో చివర్లో కొంత అసౌకర్యం కలిగింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నేతలు ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.


టేబుల్ల వద్ద వర్షపు నీరు



భిన్నత్వంలో ఏకత్వమే మన బలం

మాతృభూమికి స్వాతంత్య్రం కోసం పోరాడిన అసంఖ్యాక దేశభక్తుల నిస్వార్థ త్యాగాలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన రాజ్‌భవన్ దర్బార్ హాల్ ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గడిచిన ఏడు దశాబ్దాల్లో దేశం అద్భుత ప్రగతిని సాధించిందన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే మన అతిపెద్ద బలమని స్పష్టం చేశారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి అకుంఠిత దీక్షతో పనిచేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజ్‌భవన్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొడుకు కోసం.. తల్లి నిర్బంధం

▶ మొదటి పేజీ తరువాయి

'నీ కొడుకు మైనర్ పిల్లను ఎత్తుకొనిపోయాడు. వాడు ఎక్కడున్నాడో రెండు రోజుల్లో వెతికి తీసుకురావాలి. లేదంటే వాణ్ణి నేనే పట్టుకొచ్చి తుపాకీతో కాల్చి చంపేస్తా..'అంటూ బెదిరించాడు. దీనికి కళావతి స్పందిస్తూ.. 'కూలి పనులు చేసుకునే మాకు ఏం తెలుసు సారూ.. వాడు పట్నంలో పనిచేసుకునేవాడు. కాశీంపూర్ పిల్లతో ప్రేమ కుదిరింట. అది పిల్ల తల్లికి కూడా తెలుసు. వారు ఎక్కడికి పోయారో నాకు తెలీదు' అని చెప్పింది. దీంతో ఎస్ఐ ఒక్కసారిగా ఆవేశానికి లోనై లాఠీతో విచక్షణారహితంగా కొట్టారు. ఆ దెబ్బలకు చేతులు, కాళ్లు వాచిపోయాయని, నడవడానికి కూడా రాలేదని బాధితురాలు వాపోయింది. 'ఆ రోజు నుంచి ప్రతీ రోజు పోలీస్ స్టేషన్‌కి వస్తున్నా. రోజూ ఉదయం 9 గంటలకు పోలీస్ స్టేషన్‌కి వచ్చి కూర్చోవాలి. తాగడానికి నీళ్లు కూడా ఇవ్వరు. ఆకలితో రాత్రి 9 గంటల వరకు ఉండి సారుకు చెప్పి ఇంటికెళ్తున్న. నిన్న ఒక్క రోజే (బుధవారం) స్టేషన్‌కు రాలేదు'అంటూ ఠాణాకు వెళ్లిన విలేకరులకు చెబుతూ కళావతి కన్నీటి పర్యంతమైంది. రోజు కూలి పనులు చేసుకునే తమకు మూడు నెలలుగా పనిలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఎస్ఐపై చట్టపరమైన చర్యలు తీసుకుని, కళావతికి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

విచారణ జరుపుతాం: అశోక్, సీఐ తాండూరు రూరల్

కిడ్నాప్ కేసు విషయం మా దృష్టిలో ఉంది. కిడ్నాపర్ మైనర్ అయినా అరెస్టు చేయాల్సిందే. విచారణలో భాగంగా బాలుడి తల్లిని బషీరాబాద్ ఎస్ఐ స్టేషన్‌కు పిలిచి విచారించారు. ఎస్ఐ ఆమెను కొట్టాడనే విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ జరుపుతాం.

2 గంటలు.. 8 సెం.మీ.లు

▶ మొదటి పేజీ తరువాయి

మాదాపూర్, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్, అంబర్‌పేట, ఎల్బీనగర్, ఉప్పల్, నల్లకుంట ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లపై భారీగా వరద చేరడంతో వాహనాలు ముందుకు కదలక ట్రాఫిక్ జామ్ అయ్యింది. వర్షం నేపథ్యంలో అధికారులు అలర్ట్ ప్రకటించారు. అత్యవసరమైతే తప్ప వాహనాలతో రోడ్లపైకి రావొద్దని సూచించారు. కాలినడకన వెళ్లే వారు మ్యాన్ హోల్‌లను చూసుకొని వెళ్లాలని నగర పోలీసులు సూచించారు. ఉప్పల్, నాగోల్‌తోపాటు పలు మెట్రో స్టేషన్లలో వర్షపు నీరు చేరింది.

8.7 సెం.మీ. వర్షపాతం నమోదు

నగరంలో సగటున 8.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. ముషీరాబాద్‌లో 8.7 సెం.మీ, హిమాయత్ నగర్‌లో 7, సైదాబాద్‌లో 6.8, కూకట్‌పల్లిలో 6.6. బాలానగర్‌లో 6.5, అంబర్‌పేటలో 5.9, ఎల్బీనగర్‌లో 6.1, ఉప్పల్‌లో 6 వర్షపాతం నమోదైంది.

జూరాలకు 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం ప్రాజెక్టుకు 35వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు దిగువన, ఎగువ జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లుట్లు అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 37, 814, ఆవిరిరూపంలో 94, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వ ద్వారా 742, ఎడమ కాల్వకు 920, కోయిల్ సాగర్‌కు 630, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 500, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 41,450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.091 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల బ్యారేజీకి గురువారం 1,00,820 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. బ్యారేజి పూర్తిస్థాయి నీటిమట్టం 1.235 టీఎంసీలు కాగా 0.990 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి, 23 గేట్లు ఎత్తి దిగువ తుంగభద్ర నదిలోకి 98,371 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అంతేగాక కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు విడుదల చేస్తున్నందున మొత్తం 1,00,816 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో ఉన్నట్లు బ్యారేజి అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో 881.2 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 881.2 అడుగుల నీటిమట్టం, 194.3 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 98,371 క్యూసెక్కులు, జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,891 మొత్తం 1,36,262 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయంకు వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,540 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,913 మొత్తం 68,453 క్యూసెక్కుల నీటిని దిగువున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 25వేల క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,520 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.720 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 15.282 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు.

అయ్యో.. దేవుడా..!

- హైదరాబాద్‌లోని పెద్ద గోల్కొండ ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు ప్రమాదం
- డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరి దుర్మరణం
- కోమాల్లోకి ఓ బాలిక, మరో నలుగురికి తీవ్ర గాయాలు
- ఆత్మకూర్‌లో విషాదఛాయలు


డ్రైవర్ తాజుద్దీన్ (ఫైల్)

ఆత్మకూర్: దైవదర్శనం చేసుకుని సంతోషంగా తిరుగు ప్రయాణమైన వారిని రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబలించింది.. వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన మరో కారు వేగంగా ఢీకొట్టడంతో డ్రైవర్‌తో సహా మరో ఇద్దరు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. హైదరాబాద్‌లోని పెద్ద గోల్కొండ వద్ద చోటుచేసుకున్న ఈ ప్రమాదంతో ఆత్మకూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. వనపర్తి జిల్లా ఆత్మకూర్‌కు చెందిన తెలుగు రాజేష్ మెడికల్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శ్రావణమాసం కావడంతో యాదగిరిగుట్ట దర్శనానికి బుధవారం రాజేష్ కుటుంబసభ్యులు, కర్నూలుకు చెందిన అత్తామామలతో కలిసి రెండు వాహనాల్లో పెద్ద, చిన్నా కలిసి మొత్తం 26 మంది యాదాద్రి దర్శనానికి వెళ్లారు. బుధవారం రాత్రి అక్కడే నిద్రించి గురువారం ఉదయం 11 గంటలకు స్వర్ణగిరి పుణ్యక్షేత్రాన్ని దర్శించుకొని.. మధ్యాహ్నం భోజనం తర్వాత 3 గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం 4 గంటల సమయంలో హైదరాబాద్ పెద్ద గోల్కొండ ఫ్లై ఓవర్ ఎగ్జిట్ నంబర్ 15 వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన మరో కారు తుఫాన్‌ను ఢీకొట్టడంతో పల్టీలు కొడుతూ అవతలి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తాజుద్దీన్(40), రాజేష్ వదిన వరలక్ష్మి(44), ఈమె మనుమడు రెండు నెలల బాబు అక్కడికక్కడే మృతి చెందారు. సాయిదీక్షిత(13) అనే బాలిక కోమాలోకి వెళ్లగా, చంద్రశేఖర్, మణెమ్మ, అర్చన, కీర్తిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను శంషాబాద్‌లోని సన్‌షైన్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

డోలాహరణం చేద్దామనుకునే లోగా..

కర్నూలులో నివాసముంటున్న వరలక్ష్మి భర్త ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమె కూతురు కీర్తికి ఏడాదిన్నర క్రితం గుంతకల్లుకు చెందిన నాగేంద్రతో వివాహం జరగగా మగ పిల్లవాడు పుట్టాడు. రెండు నెలల వయస్సు ఉన్న బాబుకు డోలాహరణం నిర్వహిద్దామని కుటుంబసభ్యులు ప్రయాణంలోనే ముచ్చటించుకున్నారు. ఇంతలోనే పేరు పెట్టకుండానే బాబు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. డ్రైవర్ తాజుద్దీన్‌కు భార్య ఆసియాబేగంతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ యజమాని రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటంబం వీధిన పడిందని కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా ఈ ఘటనతో ఆత్మకూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. దైవదర్శనం చేసుకుని వస్తుండగా ఇలా జరగడంతో బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఐదు నిమిషాలు దాటితే..

హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు పెద్దగోల్కొండ ఫ్లైఓవర్ ఎగ్జిట్ నం.15 రోడ్డు కేవలం ఐదు నిమిషాలు దాటితే ఫ్లైఓవర్ దిగివచ్చేవారు. ఇంతలోనే మృత్యురూపంలో దూసుకొచ్చిన కారు తుఫాన్‌ను ఓవర్‌టేక్ చేస్తూ ఢీకొనడంతో ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న తాజుద్దీన్, రాజేష్ కుటుంబ సభ్యులు, బంధువులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు..


యాదాద్రిలో స్వామి వారి దర్శనం అనంతరం కుటుంబ సభ్యులందరూ కలిసి దిగిన గ్రూప్ ఫొటో

డబ్బులు కడితేనే వైద్యం చేస్తాం..

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు మానవత్వం మరిచి డబ్బులు కడితేనే వైద్య చేస్తామంటూ చెప్పారు. రోడ్డు ప్రమాదం అనంతరం 108లో క్షతగాత్రులను శంషాబాద్‌లోని సన్‌షైన్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాధితుల వద్ద ఆస్పత్రి నిర్వాహకులు రూ.లక్షల్లో డబ్బులు కడితేనే వైద్యం చేస్తామని తేల్చిచెప్పడంతో కంటతడి పెట్టుకున్నారు. సంఘటన జరిగి నాలుగు గంటల తర్వాత అక్కడికి చేరుకున్న ఆత్మకూర్‌కు చెందిన వారు తలా ఇంత జమ చేసి రూ.50 వేలు కట్టినా.. మరో రూ.1.50 లక్షలు కట్టాలని చెప్పడంతో విస్తుపోయారు. ఈ విషయాన్ని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి ముందుగా వైద్యం చేయాలని, అందుకయ్యే ఖర్చును ప్రభుత్వం తరఫున భరిస్తామని చెప్పడంతో చికిత్స ప్రారంభించినట్లు బాధితులు పేర్కొన్నారు.

కూలీలను కబళించిన మృత్యుశకటం


గాయపడిన వారిని అంబులెన్స్‌లోకి ఎక్కించేందుకు తీసుకెళ్తున్న సిబ్బంది


ప్రమాదంలో మృతి చెందిన తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు

- హెన్‌హెచ్-44పై ఆటోను ఢీకొట్టిన లారీ
- అక్కడికక్కడే ఒకరి దుర్మరణం.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి
- మరో 17 మందికి తీవ్రగాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం
- క్షతగాత్రులకు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స

అలంపూర్/ఉండవెల్లి: పొట్టకూటి కోసం పక్క రాష్ట్రానికి ఆటోలో వస్తున్న కూలీలను విధి వక్రీకరించింది. లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఇద్దరిని కబళించింది. ఆటో డ్రైవర్‌తో సహా మరో 18 మందిని క్షతగాత్రులుగా మార్చింది. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఈ తాండ్రపాడుకు చెందిన 20 మంది కూలీలు వ్యవసాయ పనుల నిమిత్తం ఉండవెల్లి మండలం కంచుపాడుకు ఆటోలో బయలుదేరారు. ఉండవెల్లి స్టేజీ సమీపంలోని వరసిద్ధి వినాయక కాటన్‌మిల్లు వద్దకు చేరుకున్న వీరి ఆటోను అదే మార్గంలో వేగంగా వస్తున్న భారీ లారీ ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. ఆ ధాటికి ఆటో కొన్ని మీటర్ల దూరంలో ఎగిరి పడింది. కూలీలందరూ చెల్లాచెదురుగా పడిపోయారు. ప్రమాదంలో లక్ష్మీదేవి (58) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందగా.. మరో కూలీ రమాదేవి అలియాస్ సుజాత (40) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆటో డ్రైవర్ నర్సింహతో పాటు కూలీలు ప్రియాంక, అనిత, లక్ష్మీదేవి, రాధ, వరలక్ష్మి, కె.వరలక్ష్మి, పద్మ, పావని, లక్ష్మీదేవి, చిట్టెమ్మ, నర్సింహులు, మద్దిలేటి, వరుణ్‌కుమార్, లక్ష్మీదేవి, నందు, బషీర్ అహ్మద్, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ప్రియాంక, అనితల పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

● ఆటోలో 20 మంది కూలీలు ఉండగా.. లారీ ఢీకొన్న సమయంలో అందరూ రోడ్డుకు పక్కనే చెల్లాచెదురుగా పడిపోయారు. గాయపడిన వారిని మూడు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. బాధితుడు నందు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

హెచ్‌సీఏ టోర్నీల్లో చాంపియన్‌గా నిలవాలి


ఉమ్మడి జిల్లా అండర్-16 క్రికెట్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ క్రికెట్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలవాలని మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే హెచ్‌సీఏ అండర్-16 ఇంటర్ స్కూల్, కళాశాల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు గురువారం తరలివెళ్లింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలో క్రికెట్ మైదానంలో ఉమ్మడి జిల్లా జట్టును అభినందించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారులకు హెచ్‌సీఏ ఇంటర్, కళాశాల టోర్నమెంట్ మంచి వేదికలా ఉపయోగపడుతుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు మెరుగ్గా ఆడి విజేతగా నిలవాలని క్రీడాకారులు తమ వ్యక్తిగత ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కోచ్ సాయి పాల్గొన్నారు.

అండర్-16 ఉమ్మడి జిల్లా జట్టు

జే.అంకిత్‌రాయ్, బీ.సాయిచరణ్, పీ.రామ్‌కుమార్ చారి, నవాల్ ఉర్ రహెమాన్, సయ్యద్ ఫైజాన్, దక్ష్ పాటిల్, అఖిల్. కే.భరత్, శ్రీహర్ష, డీ.అభినవ్, బీ.కాన్షిక్‌గౌడ్, కే.మణిచరణ్, కే.అక్షయ్ సాయి, ఎస్.అభినవ్ తేజ, వీ.ప్రణవ్ కార్తికేయ.

అంబులెన్స్ ప్రారంభం

పాలమూరు: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.20లక్షల విలువ చేసే అంబులెన్స్ స్నేహ ఫౌండేషన్ వితరణ చేసింది. ఈ అంబులెన్స్‌ను గురువారం పరేడ్ మైదానంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్నేహ ఫౌండేషన్ డైరెక్టర్ రామేశ్వర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ పాల్గొన్నారు.


అంబులెన్స్ ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు